## క్లుప్తంగా

### పెనమలూరు ఎంఈఓ- 2 కనకమహాలక్ష్మి

పెనమలూరు: మండలంలో ఎంఈఓ-2గా ఎం.కనకమహాలక్ష్మిని నియమించారు. కంకిపాడు ఎంఈఓగా ఉన్న కనకమహాలక్ష్మి ఆదివారం జరిగిన కౌన్సెలింగ్‌లో పెనమలూరు ఎంఈఓ-2గా నియమిస్తూ డీఈఓ ఉత్తర్వులు ఇచ్చారు. ఆమె సోమవారం విధుల్లో చేరారు. మండలానికి ఎంఈఓ- 1ను త్వరలో నియమించనున్నారు. మండలంలో 37 ప్రభుత్వ పాఠశాలలు ఉండటంతో మరో ఎంఈఓ ఆవశ్యకత ఇక్కడ ఉంది.

### రౌడీషీటర్ అరెస్టు

పెనమలూరు: కానూరులో ట్రస్టు భూముల వివాదంలో ఓ వ్యక్తిని బెదిరించిన రౌడీషీటర్ కొక్కిరిగడ్డ జాన్‌బాబును పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. పెనమలూరు సీఐ ఎం.కిషోర్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం కానూరులో రెండు వర్గాల మధ్య ట్రస్టు భూమి వివాదం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో ఒక వర్గానికి చెందిన అరవపల్లి రవికుమార్‌ను కానూరుకు చెందిన రౌడీషీటర్ కొక్కిరిగడ్డ జాన్‌బాబు బెదిరించాడు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు రౌడీషీటర్‌ను అరెస్టు చేయగా కోర్టు రిమాండ్‌కు పంపింది.

### సీహెచ్‌సీలతో మెరుగైన వైద్యసేవలు



కంకిపాడు: సామాజిక ఆరోగ్య కేంద్రం ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని దాతలు పేర్కొన్నారు. కంకిపాడులోని అక్కినేని గోపాలకృష్ణమూర్తి-సుగుణ సామాజిక ఆరోగ్యకేంద్రానికి సోమవారం డాక్టర్ చిగురుపాటి లక్ష్మీనారాయణ, మాలినీదేవి రిఫ్రిజిరేటర్‌ను వితరణగా అందించారు. డాక్టర్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ సామాజిక ఆరోగ్య కేంద్రంతో పరిసర గ్రామాల ప్రజలకు వైద్య సేవలు సమర్థంగా అందుతున్నాయన్నారు. ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ సంజయ్ మాట్లాడుతూ ప్రభుత్వం వైద్య సేవలను పటిష్టంగా అందిస్తోందన్నారు. కార్యక్రమంలో దుర్గగుడి బోర్డు మాజీ సభ్యుడు నెరుసు సతీష్, బందారు మురళీకృష్ణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

### బుడమేరు కాలువపై వంతెన నిర్మించాలంటూ వినతి



రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం నిడమానూరు దోనే ఆత్కూరులో రైతుల ప్రయోజనార్థం బుడమేరు కాలువపై వంతెన నిర్మించాలంటూ సర్పంచ్ శీలం రంగారావుతో పాటు పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, రైతులు సోమవారం నగరంలోని కలెక్టర్ కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమంలో డీఆర్వో మోహనరావుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా శీలం రంగారావు మాట్లాడుతూ దోనే ఆత్కూరులోని పొలాలకు వెళ్లేందుకు, పండిన పంటలు పొలాల నుంచి బయటకు తెచ్చుకునేందుకు రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రస్తుతం ఈ కాలువ వద్ద చప్టా ఉందని, కానీ పంటలు దీని మీదుగా తెచ్చుకునేందుకు సౌకర్యం లేదన్నారు. ఈ ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని బుడమేరుపై వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాల్సిందిగా వినతి పత్రంలో కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామ కన్వీనర్ పరిమి వంశి, అరవపల్లి భద్రయ్య, వేములపల్లి బుజ్జి, బండి జయకృష్ణ పాల్గొన్నారు.

### నేడు క్రీడా పాఠశాలలో ప్రవేశాలకు ఎంపికలు

గన్నవరం: స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఈ నెల 20వ తేదీ ఉదయం 9 గంటలకు ఆంధ్రప్రదేశ్ క్రీడా పాఠశాలలో ప్రవేశాల కోసం మండల స్థాయి ఎంపికలు నిర్వహిస్తున్నట్లు కమిటీ కన్వీనర్ డి.నాగరాజు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. క్రీడా పాఠశాలలో నాల్గవ తరగతిలో ప్రవేశం నిమిత్తం ఆసక్తి కలిగిన మూడవ తరగతి ఉత్తీర్ణులైన 8 నుంచి 9 ఏళ్లలోపు వయసు కలిగిన బాలబాలికలు హాజరుకావాలని పేర్కొన్నారు. ఐదో తరగతిలో ప్రవేశం కోసం తొమ్మిది నుంచి పదేళ్లలోపు బాలబాలికలు హాజరుకావాలని సూచించారు. ఎంపికలకు హాజరయ్యే విద్యార్థులు ఆధార్, పుట్టిన తేదీ, హెచ్ఎం జారీ చేసే స్టడీ, కాండక్ట్ పత్రాలు, కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలు, ఆరు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలను వెంట తీసుకురావాలని తెలిపారు.

### పవన్‌కల్యాణ్ నోరు అదుపులో పెట్టుకో

రామవరప్పాడు: జనసేన అధినేత పవన్ కల్యాణ్ నోరు అదుపులో పెట్టుకోకపోతే తగిన మూల్యం చెల్లించుకోవలసి వస్తుందని ముస్లిం రైట్స్ వెల్ఫేర్ వ్యవస్థాపక అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ మైనార్టీ నాయకుడు సయ్యద్ నూరుద్దీన్ హెచ్చరించారు. కాకినాడ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్, మచిలీపట్నం ఎమ్మెల్యే పేర్ని నానిలపై పవన్‌కల్యాణ్ చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడులో సోమవారం పవన్ కల్యాణ్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు.

# విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేసి అభినందిస్తున్న జెడ్పీటీసీ సువర్ణరాజు తదితరులు

కంకిపాడు: విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు అన్నారు. మండలంలోని గొడవర్రు జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం జగనన్న ఆణిముత్యాలు అవార్డుల ప్రదానోత్సవ జరిగింది. బాకీ బాబు మాట్లాడుతూ నూతన విద్యావిధానంతో దేశానికే స్ఫూర్తిగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిలిచారన్నారు. కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను నాడు-నేడు ద్వారా తీర్చిదిద్దారన్నారు. హెచ్ఎం కె.సుబ్రహ్మణ్యం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ మేరుగు విజయ చంద్రశేఖరరావు, వైఎస్సార్ టీఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ తోట సాంబశివరావు, వైఎస్సార్ సీపీ నేత చుండూరు మోహనరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. తొలుత ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులు లుక్కా జాహ్నవి, షేక్ ఇర్ఫానా, బి.మణికంఠను సత్కరించి ప్రోత్సాహక బహుమతులు అందించారు.

పెనమలూరు: పది పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన పెనమలూరు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులను సోమవారం సత్కరించారు. సర్పంచి లింగాల భాస్కరరావు ముగ్గురు విద్యార్థులకు నగదు బహూకరించారు. పాఠశాలలో ప్రథమ స్థానంలో నిలిచిన తన్వీందుకు రూ 3 వేలు, రెండో బహుమతి ఉదయ్‌కిరణ్‌కు రూ 2 వేలు, మూడె బహుమతి స్వాతికి రూ.వెయ్యి చొప్పున అందజేశారు. సర్పంచి భాస్కరరావు మాట్లాడుతూ జగనన్న ముఖ్యమంత్రి అయిన తర్వాత ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు పూర్తిగా మారాయన్నారు. నాణ్యమైన విద్య, అనేక పథకాలు అందజేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వై.దుర్గాభవాని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**విద్యారంగానికి అధిక ప్రాధాన్యం**

రామవరప్పాడు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగానికి అధిక ప్రాముఖ్యత ఇస్తున్నారని జెడ్పీటీసీ సువర్ణరాజు అన్నారు. విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా 10వ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను సోమవారం అభినందించి నగదు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా సువర్ణరాజు మాట్లాడుతూ ఎప్పుడూ లేని విధంగా ప్రభుత్వ పాఠశాలల్లో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చారన్నారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా నాణ్యమైన విద్య అందిస్తూ విద్యార్థుల భవిష్యత్‌ను బంగారుమయం చేస్తున్నారన్నారు. ఈ పథకాలను సద్వినియోగపరుచుకుని విద్యార్థులు తమ లక్ష్యాలను నెరవేర్చుకోవాలని సూచించారు. అనంతరం ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు సహజ, శైలజ, నందగోపాల్‌కు నగదు బహుమతులతో పాటు సర్టిఫికెట్లను అందజేశారు. పేద విద్యార్థిని పై చదువుల నిమిత్తం సైన్స్ ఉపాధ్యాయిని ప్రసూనాంబ రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. పలువురు ఉపాధ్యాయులు ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు సొంత నిధుల నుంచి నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం తాయారు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**నున్న జెడ్పీ హైస్కూల్‌లో ..**

నున్న(విజయవాడరూరల్): స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో సోమవారం జగనన్న ఆణిముత్యాలు అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ యర్కారెడ్డి నాగిరెడ్డి మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో విద్యారంగాభివృద్ధి కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో కార్యక్రమాలను అమలు చేస్తున్నారన్నారు. ఈ సదుపాయాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించి ఉన్నత చదువులు చదవాలని ఆకాంక్షించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను బెజవాడ శ్రీరామ్(577), మహమ్మద్ సాయి సమీర్(572), గాజుల రాజ్యలక్ష్మి(557)లకు నాగిరెడ్డి బంగారు, వెండి, కాంస్య అవార్డుల ప్రదానం చేయడంతో పాటు మూడు వేలు, రెండు వేలు, వెయ్యి రూపాయల ప్రభుత్వ ప్రోత్సాహక ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచి కలకోటి బ్రహ్మానందరెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు గిరిజాకుమారి, ప్రధానోపాధ్యాయుడు వి.భూపాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



గొడవర్రులో జరిగిన అవార్డుల ప్రదానంలో జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు, ప్రజాప్రతినిధులు



జెడ్పీ హైస్కూల్‌లో అవార్డులు స్వీకరించిన విద్యార్థులు



పెనమలూరులో విద్యార్థులను సత్కరిస్తున్న సర్పంచి లింగాల భాస్కరరావు, ఉపాధ్యాయులు

### లబ్ధిదారులు వెంటనే ఇళ్లు నిర్మించుకోవాలి



గన్నవరంరూరల్: గృహ నిర్మాణ లబ్ధిదారులు వెంటనే ఇంటి నిర్మాణాలు చేపట్టాలని ఎంపీపీ అనగాని రవి కోరారు. మండలంలోని తెంపల్లి జగనన్న లేఅవుట్ లెవెలింగ్ పనులను సోమవారం ఆయన హౌసింగ్ డీఈ టి.వెంకటేశ్వరరావు, ఏఈ ఎస్.సత్యన్నారాయణతో కలసి పరిశీలించారు. లే అవుట్‌లో గన్నవరానికి చెందిన లబ్ధిదారులు అధికంగా ఉన్నారని అధికారులు ఎంపీపీకి వివరించారు. లబ్ధిదారులకు సమాచారం పంపి లెవెలింగ్ పనులు పూర్తయిన విషయం తెలపాలని, వారు వెంటనే ఇళ్లు నిర్మించుకుంటారని ఎంపీపీ చెప్పారు. హౌసింగ్ సిబ్బంది, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

### ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలు పరిష్కరించండి

కంకిపాడు: ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఏపీ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) ప్రతినిధులు విజ్ఞప్తిచేశారు. ఎమ్మెల్యే పార్థసారథి వ్యక్తిగత సహాయకుడు జనార్ధన్‌ను ఎమ్మెల్యే కార్యాలయంలో సోమవారం కలిసి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందించారు. వినతిపత్రం సమర్పించిన వారిలో కృష్ణాఫ్యాప్టో చైర్మన్ బి.లంకేష్, సెక్రటరీ జనరల్ పీటా ఇమ్మానుయేలు, డెప్యూటీ చైర్మన్ మట్టా రాజేష్, జిల్లా ప్రతినిధులు ఏ.శ్రీనివాస మూర్తి, పి.సురేష్‌బాబు తదితరులు ఉన్నారు.

### జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సమర్థంగా నిర్వహించాలి

హనుమాన్‌జంక్షన్‌రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని చిత్తశుద్ధితో సమర్థంగా నిర్వహించాలని బాపులపాడు ఎంపీపీ యర్రగొర్ల నగేష్, ఎంపీడీవో కె.జోగేశ్వరరావు అన్నారు. స్థానిక మహాత్మగాంధీనగర్‌లోని మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ సచివాలయం అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలతో జగనన్న సురక్ష కార్యక్రమంపై వారు సమీక్ష నిర్వహించారు. ప్రజలకు ప్రభుత్వ పథకాలు, ప్రభుత్వ ధ్రువీకరణ పత్రాల మంజూరులో ఏవైనా సమస్యలు ఎదురైతే సత్వరం పరిష్కరించడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధతో ఈ కార్యక్రమానికి రూపకల్పన చేశారని చెప్పారు. వచ్చే నెల 1వ తేదీ నుంచి గ్రామ సచివాలయాల వారీగా పంచాయతీ, రెవెన్యూ అధికారులు క్యాంపులు నిర్వహించాలని ఆదేశించారు. గ్రామ వలంటీర్లు ప్రతి ఇంటికీ వెళ్లి యాప్‌లో వివరాలను నమోదు చేస్తారని, పత్రాలను స్వీకరిస్తారని తెలిపారు.

### స్పందనలో మూడు దరఖాస్తులు



అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ జాహ్నవి

విజయవాడరూరల్: విజయవాడ రూరల్ మండల తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో మూడు దరఖాస్తులు వచ్చాయి. నున్న గ్రామంలో ఇళ్ల మధ్య కాలినడకను ఏర్పాటు చేయాల్సిందిగా కోరుతూ యర్కారెడ్డి మోహన్‌రెడ్డి తహసీల్దార్‌కు దరఖాస్తు అందజేశారు. పాతపాడు గ్రామంలో ఆర్ఎస్ నంబరు 340 ను 1బి లో నమోదు చేయాలని దరఖాస్తు వచ్చింది. కొత్తూరు తాడేపల్లి గ్రామం ఆర్అండ్‌బీ రోడ్డు ఆక్రమణలు తొలగించాలని కోరుతూ మరో దరఖాస్తు వచ్చింది. స్పందన కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

**ప్రభుత్వ భూముల గుర్తింపు**

రీసర్వేలో భాగంగా సోమవారం నుంచి అంబాపురం, పి.నైనవరం, కొత్తూరు, వేమవరం, తాడేపల్లి, షాబాదు, జక్కంపూడి, పైడూరుపాడు గ్రామాల్లో ప్రభుత్వానికి సంబంధించిన అస్సైన్‌మెంటు ల్యాండ్‌ను గుర్తిస్తామని తహసీల్దార్ తెలియజేశారు.

### శ్రీకోదండ రామస్వామికి విశేష పూజలు



శ్రీకోదండ రామస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలో శ్రీకోదండ రామస్వామి ఆలయంలో జరుగుతున్న మహా కుంభాభిషేకం పూజా కార్యక్రమాల్లో రెండవ రోజు సోమవారం స్వామి వారికి అలంకారం చేసి వేదపండితులు విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం సువాసినులచే విశేష కుంకుమార్చన, విశేష హోమాలు జరిగాయి. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు.

# చకచకా..

- కంకిపాడులో ప్రభుత్వ భవనాల నిర్మాణాలు
- రూ 99.05 లక్షల వ్యయ అంచనాతో జరుగుతున్న పనులు
- సమకూరనున్న వివిధ శాఖల కార్యాలయాలు

కంకిపాడు: వివిధ శాఖలు సొంత భవనాల్లో కొలువుదీరనున్నాయి. మండల కేంద్రమైన కంకిపాడులో ప్రభుత్వ భవనాల నిర్మాణాలు శరవేగంగా సాగుతున్నాయి. ఇవి పూర్తై అతి త్వరలో ప్రజలకు ఆయా కార్యాలయాల ద్వారా మెరుగైన సేవలు అందుబాటులోకి రానున్నాయి.

**రూ. 99.05 లక్షల వ్యయఅంచనాతో..**

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చింది. జనాభా ప్రాతిపదికన సచివాలయాలు, వాటికి అనుసంధానంగా ప్రధాన కార్యాలయాలను అందుబాటులోకి తేవడానికి నిధులు కేటాయిస్తోంది. దీనిలో భాగంగా లాకు రోడ్డు కేంద్రంగా కంకిపాడులోని 1వ సచివాలయం పరిధిలో రైతుభరోసా కేంద్ర నిర్మాణానికి రూ.21.80 లక్షలు కేటాయించారు. 2వ సచివాలయం పరిధిలో రైతుభరోసా కేంద్రానికి రూ.21.80 లక్షలు, వెల్‌నెస్ సెంటరుకు రూ.17.50లక్షలు, బల్క్ మిల్క్ చిల్లింగ్ సెంటరుకు రూ.20.45 లక్షలు, కంకిపాడు-1 సచివాలయం పరిధిలో చెరువు కట్ట వద్ద వెల్‌నెస్ సెంటరు రూ 17.50 లక్షల వ్యయ అంచనాతో నిర్మాణంలో ఉన్నాయి. కంకిపాడు-2 రైతుభరోసా కేంద్రం దాదాపు పూర్తైంది. మిగిలిన భవనాల నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి.

**త్వరలో మరింత చేరువగా..**

భవనాల నిర్మాణాలు త్వరలో పూర్తయ్యేలా అధికారులు, పంచాయతీ పాలకవర్గం కృషి చేస్తుంది. ఇవి అందుబాటులోకి వస్తే ఆయా కార్యాలయాల ద్వారా ప్రజలకు మరింత మెరుగ్గా, సమర్థంగా సేవలు అందుతాయని పట్టణ ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



కంకిపాడు-2 సచివాలయ పరిధిలో నిర్మాణం తుదిదశకు చేరుకున్న రైతుభరోసా కేంద్రం



నిర్మాణంలో ఉన్న వెల్‌నెస్ సెంటర్



కంకిపాడు-1 సచివాలయం పరిధిలో సాగుతున్న రైతుభరోసా కేంద్రం పనులు



### ఉయ్యూరు టు అరుణాచలం.. ప్రత్యేక బస్సు సర్వీసు

ఉయ్యూరు: ఉయ్యూరు ఆర్టీసీ డిపో నుంచి అరుణాచలానికి ప్రత్యేక బస్సు సర్వీసు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ కె.ఎస్.ఆర్.కె.ప్రసాద్ తెలిపారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. జూలై 1వ తేదీ రాత్రి 8 గంటలకు ఉయ్యూరు డిపో నుంచి అరుణాచలం గిరిప్రదక్షిణకు ప్రత్యేక బస్సులను నడుపుతున్నామని వివరించారు 1వ తేదీ బయలుదేరి, 2వ తేదీ శ్రీకాళహస్తి దర్శనం చేసుకుని, మధ్యాహ్నం కాణిపాకం, అనంతరం శ్రీపురం, అదే రోజు రాత్రి అరుణాచలం చేరుతారన్నారు. 3వ తేదీన గురుపౌర్ణమి-ఆషాఢ పౌర్ణమి సందర్భంగా గిరి ప్రదక్షిణ దర్శనం పూర్తవుతుందన్నారు. తిరిగి 4వ తేదీ ఉయ్యూరు చేరుతారని భక్తులు ప్రత్యేక బస్సు సర్వీసును సద్వినియోగం చేసుకోవాలన్నారు. టిక్కెట్ ధర ఒక్కరికి రూ 2700గా నిర్ణయించామన్నారు. 95599 ద్వారా ఆన్‌లైన్ రిజర్వేషన్ సౌకర్యం కల్పించామని తెలిపారు. వివరాలకు 7382893468 నంబరులో సంప్రదించాలని సూచించారు.

# అంగన్‌వాడీ కేంద్రాలతో బంగరుబాట



యనమలకుదురులో గ్రాడ్యుయేషన్ డే



గంగూరులో..

పెనమలూరు: అంగన్‌వాడీ కేంద్రాలతో చిన్నారులకు బంగరు బాట వేయాలని సూపర్‌వైజర్ విజయలక్ష్మి అన్నారు. జనభాగీదారిలో భాగంగా యనమలకుదురు- గంగూరు గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సోమవారం చిన్నారులకు గ్రాడ్యుయేషన్ డే ఘనంగా నిర్వహించారు. యనమలకుదురులో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ జి.విజయలక్ష్మి మాట్లాడుతూ ఆరు సంవత్సరాల లోపు చిన్నారులకు శారీరక, మానసిక, వ్యక్తిత్వ వికాసం పెంపొందించడానికి కార్యక్రమం నిర్వహిస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఎల్.ప్రతిభ, ఎండీ ఆసియాబేగం, షహనాజ్‌బేగం, తల్లితండ్రులు పాల్గొన్నారు.

**గంగూరులో..**

గంగూరులోని అంగన్‌వాడీలో చిన్నారులకు గ్రాడ్యుయేషన్ డే ఘనంగా నిర్వహించారు. గోసాల సెక్టార్ సూపర్‌వైజర్ టి.రమానాగమణి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఇంగ్లిష్ నేర్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సుబ్బారావు, మహిళా సంరక్షణ కార్యదర్శి జ్యోతి, ఏఎన్ఎంలు, ఆశలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

### రేపు దత్త క్రియాయోగా పరిచయం

ఆటోనగర్(విజయవాడతూర్పు): పటమటలోని గణపతి సచ్చిదానంద స్వామీజీ ఆశ్రమంలో బుధవారం ఉదయం 6 నుంచి 7 గంటల వరకు దత్త క్రియా యోగా పరిచయం- సాధనపై కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు విజయవాడ శాఖ సమన్వయకర్త పంద్రవాడ అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. 10 సంవత్సరాల పైబడిన వారు ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో పాల్గొనవచ్చన్నారు. ప్రవేశం ఉచితం అని తెలిపారు. పూర్తి వివరాలకు 9866041332 కి ఫోన్ చేయాలని కోరారు.

### ఏడు గ్రామ సచివాలయాల్లో భూ రిజిస్ట్రేషన్లు ప్రారంభం

హనుమాన్‌జంక్షన్‌రూరల్: బాపులపాడు మండలంలోని పలు గ్రామ సచివాలయాల్లో దస్తావేజుల రిజిస్ట్రేషన్ సేవలు అందుబాటులోకి వచ్చాయని ఎంపీడీవో కె.జోగేశ్వరరావు సోమవారం తెలిపారు. మండలంలోని బొమ్ములూరు, కోడూరుపాడు, ఓగిరాల, కొత్తపల్లి, రంగన్నగూడెం, శేరీనరసన్నపాలెం, తిప్పనగుంట గ్రామ సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లు ప్రారంభినట్లు చెప్పారు. ఆయా గ్రామాలకు చెందిన ఇళ్ల స్థలాలు, పంట పొలాలు, వీలునామా, దత్తత, వివాహ రిజిస్ట్రేషన్లు గ్రామ సచివాలయాల్లోనే జరుగుతాయని తెలిపారు. భూముల రిజిస్ట్రేషన్లతో పాటుగా ఈసీ, నకలు, మార్కెట్ విలువ తెలిపే సర్టిఫికెట్లు కూడా గ్రామ సచివాలయాల్లోనే లభిస్తాయని తెలిపారు. ప్రజల ముంగిట అందుబాటులోకి వచ్చిన రిజిస్ట్రేషన్ సేవలను సద్వినియోగించుకోవాలని ఎంపీడీవో కోరారు.

### వైభవంగా వారాహి దేవి నవరాత్రులు

చిట్టినగర్(విజయవాడ పశ్చిమ): పాలప్రాజెక్టు క్వార్టర్స్ సమీపంలోని శ్రీలలితాంబికా పీఠంలో సోమవారం నుంచి వారాహిదేవి నవరాత్రులు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం గణపతి పూజ, వారాహిదేవి అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు చేశారు. అమ్మవారికి పీఠాధీశ్వరి శివలీలా మాతాశ్రీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో సామూహిక కుంకుమార్చనలు నిర్వహించగా, పెద్ద ఎత్తున ఉభయదాతలు పాల్గొన్నారు. ఉత్సవాలను పురస్కరించుకుని పీఠంను ప్రత్యేకంగా అలంకరించారు. ఉత్సవాలలో పాల్గొన్న భక్తులకు ప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమాలను పీఠం కన్వీనర్ చైతన్య స్వామి పర్యవేక్షించారు.

### బీఎల్‌ఓలు బాధ్యతగా పనిచేయాలి

ఆర్డీఓ పద్మావతి

గుడివాడ టౌన్: అతి త్వరలో ఎన్నికలు రానున్న సమయంలో బూత్ లెవల్ ఆఫీసర్లు (బీఎల్ఓ) బాధ్యతగా వ్యవహరించాలని ఆర్డీఓ పి.పద్మావతి అన్నారు. స్థానిక మున్సిపల్ కౌన్సిల్ సమావేశం హాలులో సోమవారం బీఎల్ఓలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరినీ ఓటర్లుగా చేర్చాలన్నారు. ప్రస్తుతం ఉన్న ఓటర్ల జాబితాలో మార్పులకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలన్నారు. ఓటరు ఇచ్చిన ఆధారాలతో పాటు కార్యాలయాల్లో ఉన్న ఆధారాలను పోల్చి చూసి మార్పులు చేయాలన్నారు. కొత్త ఓటర్ల నమోదు, ఓటర్ల బదిలీ, ఆధార్‌తో అనుసంధాన విషయంలో బాధ్యతగా వ్యవహరించాలన్నారు. లేని పక్షంలో ఓటరు తన ఓటుహక్కును కోల్పోతారన్నారు. ప్రతి ఒక్కరూ తమకు అప్పగించిన పనులు వేగవంతంగా పూర్తిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ, తహసీల్దార్ కె.ఆంజనేయులు, ఎలక్షన్ డీటీ లోకరాజు, అసిస్టెంట్ కమిషనర్ రంగారావు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

### బ్యాంకు ఉద్యోగుల సంక్షేమమే ధ్యేయం

గుడ్లవల్లేరు: బ్యాంకు ఉద్యోగుల సంక్షేమమే తమ సంఘ ధ్యేయమని కెనరా బ్యాంకు ఉద్యోగుల సంఘ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సీహెచ్.అభయాంజనేయస్వామి అన్నారు. కెనరాబ్యాంకు ఉద్యోగుల రాష్ట్ర స్థాయి సంఘానికి వరుసగా మూడో సారి సభ్యుడిగా ఎన్నికైన అభయాంజనేయస్వామిని సోమవారం అంగలూరు కెనరాబ్యాంకులో మేనేజర్ కె.విజయ్‌కుమార్ చేతుల మీదుగా ఉద్యోగులు సన్మానించారు. ఉద్యోగుల సంక్షేమానికి అభయాంజనేయస్వామి చేస్తున్న కృషిని విజయ్‌కుమార్ కొనియాడారు. కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.